నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 19 ఆగస్టు 2023

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మరమ్మతులు కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఏడిఈ టౌన్ 1 ఆర్ చంద్రశేఖర్, ఏడిఈ టౌన్ 2 తోట రాజశేఖర్, ఏడీఈటౌన్ 3 పి.వీరేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ పట్టణంలోని ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో ఉదయం 8.00 గంటల నుండి 12.00 గంటల వరకు పవర్‌హౌస్, తిలక్ గార్డెన్, వినాయకనగర్, బోర్గం, దుబ్బ, ముబారక్‌నగర్, సుభాష్‌నగర్, అర్సపల్లి, మిర్చి కాంపౌండ్‌తో పాటు న్యూ హౌసింగ్ బోర్డు ఉప కేంద్రాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగరంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బిచ్కుంద ఐటీఐలో ప్రవేశాలకు మూడవ విడత దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని దడ్గీ చౌరస్తాలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో మూడో విడత అడ్మిషన్లకై నోటిఫికేషన్ జారీ చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ తోట వెంకటశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత అడ్మిషన్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన, ఫెయిల్ అయిన విద్యార్థిని, విద్యార్థులు ఆన్లైన్లో ఆప్షన్స్ పెట్టుకోవాలని ప్రస్తుతం ఐటీఐ బిచ్కుంద కళాశాలలో ఎలక్ట్రిషన్‌లో 6 ఖాళీలు, సేవింగ్ టెక్నాలజీ (టైలరింగ్)లో 35 ఖాళీలు ఉన్నాయని దరఖాస్తు చేయాల్సిన తేదీ ఈ నెల 19 నుంచి 30వ తారీకు వరకు చేసుకోవాలని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సభ్యులు చెప్పే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ సూచన
- పలు అంశాలపై వాడీవేడిగా సమావేశం..
- ప్రయివేటు ఆస్పత్రుల తనిఖీలు, చర్యలకు ఆదేశం

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేసే ప్రజాప్రతినిధులకు సమస్యలు తెలుసునని, సభలో వారు ఏకరువు పెట్టిన సమస్యల పట్ల అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కార దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ధఫెదార్ శోభ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జెడ్పి చైర్ పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహంచారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, గ్రామా రెవిన్యూ సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ఆర్.టి.సి. ని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు అండగా నిలవడం పట్ల ముఖ్యమంత్రి కె .సి.ఆర్. కు ధన్యవాదాలు తెలుపుతూ జెడ్పి వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ ప్రవేశ పెట్టిన తీర్మానాలపై సభ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా వ్యవసాయం, పశు సంవర్ధకం, విద్య, వైద్య, నీటిపారుదల, విద్యుత్తు, రోడ్లు, భవనాలు, పంచాయత్ రాజ్, డి.ఆర్.డి.ఓ. శాఖల ప్రగతిని సమీక్షించారు.

ముందుగా వ్యవసాయ శాఖ ప్రగతిని సమీక్షిస్తూ జిల్లాలో 34,347 మంది రైతులకు75 కోట్ల 17 లక్షల పంట రుణాలు మాఫీ చేశామని, 2 లక్షల 96 వేల మంది రైతులకు రైతు బంధు, 1,238 మంది నామినీలకు రైతుభీమా అందించి ఆదుకున్నామన్నారు. కాగా సహకార సంఘాలలో రుణమాఫీ వన్ టైం సెట్టిల్మెంట్ చేయడంలేదని, యాసంగిలో వడగండ్ల వానవల్ల పంట నష్టం జరిగిన రైతులకు నష్టపరిహారం అందించేలా చూడాలని పలువురు సభ్యులు కోరగా తగు చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ పాటిల్ లీడ్ బ్యాంకు అధికారికి, వ్యవసాయాధికారి సూచించారు. జిల్లాలో కౌలాస్‌నాల, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు రబీకి అవసరమైన సాగు జలాలు అందిస్తామన్నారు. గొర్రెల అభివృద్ధి పథకం కింద గొల్ల కురుమలకు ఇచ్చిన గొర్రెలను కుక్కలా దాడి వల్ల చనిపోయిన లబ్దిదారులకు తగు ఆర్థిక సహాయం అందించేలా చూడాలని జెడ్పి వైస్ చైర్మన్ కోరగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ శాఖ ను సమీక్షిస్తూ తిరుమలాపూర్, రామేశ్వర్ పల్లి, మహామూద్ నగర్, కాటేపల్లి , వజ్రకండి, పెద్ద ఎక్లారా , పెద్ద గౌరారం లో నూతనంగా సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని తెలుపగా వెంటనే టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు మొదలుపెట్టవలసినదిగా శాసనసభ్యులు హనుమంత్ షిండే విద్యుత్తు అధికారిని ఆదేశించారు. 3 ఫేస్ కరెంటు సక్రమంగా రావడం లేదని, ఇనుప స్థంబాల వళ్ళ పశువులు చనిపోతున్నాయని సభ్యులు ప్రశ్నించగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టర్ల కొరత వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం పనిచేస్తున్న స్టాఫ్ ను సర్దుబాటు చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా ఉంచి పర్యవేక్షిస్తుండాలని సభ్యులు కోరారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

నవతెలంగాణ దినపత్రిక రామారెడ్డి మండలం విలేఖరి కామారెడ్డి పట్టణ కేంద్రంలోని లైఫ్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటే తగ్గుముఖం పట్టలేదని రామారెడ్డి ఎంపీపీ సభ దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా పట్టణ కేంద్రంలోని శిషరక్ష పిల్లల ఆసుపత్రిలో వేల రూపాయలు దండుకుంటున్నారని జిల్లా స్థాయి అధికారులు ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వైద్యాధికారి స్పందించి తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలు, వసతి గృహ విద్యార్థులకు కండ్ల కలక వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వైద్యాధికారి సూచించారు. ఈ నెల నుండి కొత్తగా 173 మంది బీడీ, చేనేత కార్మికులకు ఆసరా పింఛన్లు అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, యం.పి .బిబి పాటిల్, శాసనసభ్యులు హనుమంత్ షిండే, జాజాల సురేందర్, , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, జెడ్పి సీఈఓ సాయ గౌడ్, ఎంపిపిలు, జెడ్పిటిసిలు, కో అప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాగ్వాదం

తమ మండలానికి జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయడం లేదని నాగిరెడ్డిపేట్ ఎంపీపీ రాజ్‌దాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. బీసీ గురుకులాన్ని సైతం వేరే చోట ఏర్పాటు చేశారని, నాగిరెడ్డిపేట్‌లో స్థలం చూసినా ఇంకా తరలించడంలేదని చెప్పగా.. అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ఉన్న సమస్యలను దృష్టికి వస్తే ఎందుకు అడ్డుకుంటున్నారని అధికార పార్టీ ప్రజాపతులపై ఆయన మండిపడ్డారు. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ దశధర్ శోభ జోక్యం చేసుకొని ఇరువురి ప్రజా ప్రతినిధులకు నచ్చజెప్పారు.

80 మంది విద్యార్థులకు ఒక్క టీచరేనా..?



లింగంపేట్ : లింగంపేట్ మండలంలో భవానిపేట్ హరిజనవాడలో ఉచ్చతర పాఠశాలలో 80 మంది విద్యార్థులకు ఒకే టీచర్ ఎలా బోధిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారిని లింగంపేట్ జడ్పీటీసీ ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి ప్రశ్నించారు. దీంతో చదువులు కుంటుపడుతున్నాయని అన్నారు. సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఒక్కొక్క పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఐదుగురు టీచర్లు పనిచేస్తున్నారని విద్యార్థులు సంఖ్య ఎక్కువనచోట ఉపాధ్యాయులను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆమె మండిపడ్డారు. అదేవిధంగా రాంపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి కింద పాఠశాల భవనం కూల్చివేగా ఒకే గదిలో 50 మంది విద్యార్థులు ఇరుకు గదిలో చదువుకుంటున్నారని ఆమె అన్నారు. లింగంపేట్ బాలికలు ఉన్నత పాఠశాల మన ఊరు మన బడిలో కోటి రూపాయల పైగా నిధులు మంజూరైన ఇప్పటివరకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పాఠశాల స్థితిలో చేరుకొని వర్షాకాలం వస్తే విద్యార్థులు ప్రాణాలు అరచేతులో పెట్టుకొని పాఠశాలకు రావాల్సి వస్తుందన్నారు. విచారణ చేపట్టి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



రాస్తారోకో చేపట్టిన విద్యార్థులు

ప్రత్యేకంగా బస్సు నడపాలి

విద్యార్థుల రాస్తారోకో

నవతెలంగాణ-బోధన్

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతూ శుక్రవారం సాలూర మండల అంతరాష్ట్ర రహదారిపై కళాశాల విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలూర, ఫతేపూర్, తగ్గెల్లి గ్రామాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు బోధన్ పట్టణంలోని కళాశాలలో చదువుకోడానికి వెళ్తారని, కాని సమయానికి బస్సు లేక విద్యార్థులు తరగతులు కోల్పోతున్నారని అన్నారు. గతంలో తగ్గెల్లి వరకు ఉన్న బస్సు రద్దు చేయడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. హూన్సా నుంచి వచ్చే బస్సులో నిలబడి రద్దీగా వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు నడపాలని డిపో మేనేజర్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల రాస్తారోకో వలన ఇరువైపుల వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు రాస్తారోకో విరమించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

- డెంగ్యూ నివారణకు తగు చర్యలు తీసుకోవాలి : అధికారులతో ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత అధికారులకు శుక్రవారం సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్‌తో సెల్‌ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. దోమల నివారణ మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేస్తూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల నివారణ మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఎక్కడ కూడా నిర్లక్ష్యం వహించద్దని ఆమె అధికారులను కోరారు.

పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

- సర్వాయిపాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో కలెక్టర్



సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల బాధ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అన్యాయాన్ని ఎదురిస్తూ, సర్వాయి పాపన్న గౌడ్ చూపిన పోరాట తెగువ అనన్యసామాన్యమైనదని కొనియాడారు. రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసామాన ధైర్య సాహసాలతో పోరాటం చేశారని తెలిపారు. నాటి దౌర్జన్యాలను ఎండగడుతూ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం జయించి, జనరంజకంగా పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోంద న్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని, ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అందరూ సమానులేననే భావన పెంపొందేం దుకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. గీత కార్మికులు సమిష్టిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమా లను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల బాధ్యులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ బోధన్ అసెంబ్లీ నాయకులు శుక్రవారం ఆర్డీఓ రాజాగౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు అడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితబంధు పథకం, బీసీబంధు పథకం, గృహలక్ష్మీ పథకాలను అర్హులైన వారికి మాత్రమే అందించాలని కోరారు. అలాగే గత 9 సంవత్సరాలుగా సొంతంగా ఇంటి నిర్మాణం చేసుకున్న మహిళలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ బోధన్ అసెంబ్లీ కన్వీనర్ కురెళ్ళ శ్రీధర్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని నిర్బంధాలు ఎదురైనా

భూ పోరాటం ఆపేది లేదు

- రియల్ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలుకుతూ నాయకులపై కేసులా..?
- సీపీఐ(ఎం) భూ పోరాట కేంద్రాన్ని సందర్శించిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్రమకేసులు పెట్టినా, నిర్బంధాలు ఎన్ని ఎదురైనా భూ పోరాటాన్ని ఆపేది లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ స్పష్టంచేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) నిజామాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మూడు నెలలుగా దుబ్బా ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇళ్ల స్థలాల పోరాట కేంద్రాన్ని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరించకుండా రాబోయే కాలంలో ఏ పార్టీ కూడా అధికారంలోకి రాదని స్పష్టంచేశారు. ఇండ్ల స్థలాల సమస్య రాజకీయ ఎజెండాగా మార్చుకుంటున్నారు తప్ప ఆచరణలో ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు. వేలాదిమంది ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నారంటే సమస్య ఏ విధంగా ఉందో అర్థం చేసుకో వాలని అన్నారు. నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్న ఇండ్ల స్థలాల పోరాటం నాయకులపై అక్రమ కేసులు బనాయించడం అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారు లకు వత్తాసు పలకడమే అవుతుందని అన్నారు. 171 సర్వే నంబర్‌లో ఉన్న 13 ఎకరాల 35 గుంటల ప్రభుత్వ భూమిని సర్వే చేసి ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, పోలీసులు ప్రజాపక్షమా ! రియల్ ఎస్టేట్ వ్యాపారుల పక్షమా? తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలు సాధించేంతవరకు ప్రజలు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పోరాటానికి అండగా సీపీఐ(ఎం) ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు పెద్ది సూరి, బెజుగం సుజాత, నగర కమిటీ సభ్యులు ద్యారాంగుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూపోరాటం చేస్తున్న పేదలతో మాట్లాడుతున్న భూపాల్



భూపోరాట కేంద్రాన్ని సందర్శిస్తున్న నాయకులు

ముస్లిం లీడర్లు మాట్లాడితే టెర్రరిస్టు ముద్ర

- ముస్లిం మైనార్టీలకు బీజేపీ, కాంగ్రెస్‌లే ప్రధాన శత్రువులు
- ఎమ్మెల్యే షకీల్ ఆమెర్

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న షబ్బీర్అలీ

ముస్లిం, మైనారిటీలను కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా వాడుకొని మోసం చేసిందని, కానీ ఏనాడు వారి అభివృద్ధి కోసం పాటుపడలేదని ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. బోధన్ పట్టణంలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశం విజయ వంతం కావడంతో ప్రతిపక్ష నాయకులు ఓర్వలేకపోతున్నారని అన్నారు. బిజెపి ఎంపీ సయద్ జఫర్ అస్లాం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని అలాంటివి మానుకోవాలని హెచ్చరిం చారు. మైనారిటీల కోసం, దళితుల కోసం బిజెపి కృషి చేసిందని అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఎంపీ అరవింద్ ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. ముస్లింల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం 2500 కోట్ల రూపా యలు వెచ్చించిందని అన్నారు. ముస్లిం లీడర్లు మాట్లాడితే బీజేపీ ప్రభుత్వం టెర్రరిస్టులుగా ముద్ర వేస్తుందని అన్నారు. ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్, బిజెపి పార్టీలే ప్రధాన శత్రువులని పేర్కొన్నారు. జిల్లాలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు కనీస డిపాజిట్ రాదని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమే వారి హయంలో ముస్లింల గొడవలకు ప్రధాన కారణమని ఆరోపించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు అంతర్గతంగా ఒకటేనని అన్నారు. కాబట్టి ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్, బిజెపి మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందని, అంతేకాకుండా ముస్లింల సంక్షేమానికి కృషి చేసింది ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఎలాంటి పనులు చేయలేదని మండిపడ్డారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బోధన్‌కు కనీసం మెడికల్ కాలేజ్ తేలేదని విమర్శించారు. మాజీ మంత్రి హయంలోని ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ మూతపడిందని ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ కార్మికుల దీక్షల వద్దకు పోతున్నారని అన్నారు.

24 నుండి ఇంటింటికి బిఆర్ఎస్..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు వివరించడానికి ఈనెల 24వ తేదీ నుండి గడప గడపకు బీఆర్ఎస్ అనే కార్యక్రమం చేస్తున్నట్లు ఎమ్మెల్యే షకీల్ అమీర్ ప్రకటించారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు ఎంతమందికి అందాయి, ఇంకా ఎలాంటి పథకాలు అమలు చేయాలని ప్రజలను అడిగి తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షులు రవీందర్ యాదవ్, సాలూర మండల అధ్యక్షులు నరసయ్య, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, నాయకులు నక్క లింగారెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నపత్రంలో సిలబస్‌లో లేని ప్రశ్నలు

మార్కులు కోల్పోతామని ఎమ్మెస్సీ విద్యార్థులు ఆవేదన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఎంఎస్సీ మొదటిసంవత్సరం బొటనీ పరీక్షలో సిలబస్‌లో లేని రెండు ప్రశ్నలు వచ్చాయని, దీంతో తాము మార్కులు కోల్పోయే అవకాశం ఉందని విద్యార్థులు వాపోతున్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం ఎమ్మెస్సీ బొటనీ ఫస్టియర్ పరీక్ష జరిగింది. అయితే సెలబస్‌లో లేని 2 ప్రశ్నలు 5 మార్కులు లవి వచ్చాయని విద్యార్థులు వాపోయారు. ఈ విషయమై అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లగా.. యూనివర్సిటీకి సంబంధించిన విషయమని తాము ఏమీ చేయలేమని చెప్పినట్టు విద్యార్థులు తెలిపారు. సిలబస్‌లో లేనిది వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన మార్కులు కలపాలని యూనివర్సిటీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. ప్రశ్న పత్రంలో 5 ప్రశ్నలకు 4 సమాధానాలు ఇస్తే 20 మార్కులు ఉన్నాయని, దానిలో మొదటి, రెండవది సిలబస్‌లో లేనివి వచ్చాయని పలువురు విద్యార్థులు నవతెలంగాణ దృష్టికి తీసుకువచ్చారు.

నిరుపేదలకే 'డబుల్' ఇండ్లు

- పైరవీలకు తావు లేదు : మంత్రి ప్రశాంత్‌రెడ్డి



డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-మోర్తాడ్

ఇండ్లు లేని నిరుపేదలకే ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తుందని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పంపిణీ శుక్రవారం నిర్వహించారు. 224 గృహ నిర్మాణాలు నిర్మించినప్పటికీ 155 మంది అర్హుల జాబితాను మాత్రమే ఎంపిక చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వందలాది దరఖాస్తులు వచ్చినప్పటికీ గ్రామంలో పూర్తిస్థాయిలో ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి మొదటి దశలో ఇండ్లు ఇచ్చామని, రెండు దశ ,మూడోదశ ఇండ్లు కూలిపోయే దశలో ఉన్న వారికి వాటితోపాటు ఒకే ఇంట్లో అధిక సంఖ్యలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు గుర్తించి ఇండ్లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

వీటితోపాటు నివాస స్థలమున్నవారికి గృహ లక్ష్మీ పథకం ద్వారా గ్రామంలో 120 మందికి మూడు లక్షల రూపాయలు రుణం అందజేస్తున్నామని లబ్ధిదారుల ఎంపిక కూడా కొనసాగుతుందని అన్నారు. 13.5 కోట్ల రూపాయలతో 204 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేశామని మరో కోటిన్నరతో రోడ్ల నిర్మాణం పూర్తి చేసి అర్హుల జాబితాపకారమే లబ్ధిదారులకు ఇండ్లు అందజేస్తున్నామని తెలిపారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఎంపిక అధికారులకు అప్పజెప్పామని వారు ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారుల ఎంపిక చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం మహిళల పేరుపైనే ఇండ్లు అందజేస్తున్నామని, బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటికీ పదిచోట్ల 15 వందలకు పైగా డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలు పూర్తిచేసుకుని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. అంతకుముందు రైతు వేదికలో గ్రూప్ ఫోర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తున్న నియామక పత్రాలను పంపిణీ చేశారు. సర్దార్ పాపన్న జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, సర్పంచ్ ధరణి, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పిటిసి రవి, ఆర్ అండ్ బి ఎస్ సి రాజేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నుడా చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



నుడా చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఈగ సంజీవరెడ్డి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నూడా డైరెక్టర్ అభిలాష్, బొర్గం సొసైటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఎంపీటీసీ ముత్తన్న, మోపాల్ సొసైటీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నహీం పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈఓ

నవతెలంగాణ-బాల్కొండ



ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి రఘురాజు శుక్రవారం తనిఖీ చేశారు. తరగతులను తనిఖీ చేస్తూ విద్యార్థులకు ప్రస్తుతం కొనసాగుతున్న సిలబస్, పలు సమస్యల గురించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపకుల అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. కళాశాల స్థితిగతులను తెలుసుకుంటూ అధ్యాపకులకు పలు సూచనలను చేశారు. ఆయనతోపాటు ప్రిన్సిపాల్ చిన్నయ్య, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

రద్దు చేస్తామన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలపై

సీఎం కేసీఆర్ వైఖరి తెలపాలి

- ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి
- సమ్మె శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ తీసుకొచ్చిన ప్రయివేటీకరణ, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తామన్న సీఎం కేసీఆర్.. తన వైఖరీని స్పష్టం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రెండో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. అంతకుముందు ఏఎన్ఎలు ధర్నా చౌక్ వద్ద మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ గత 20 ఏండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరిని అందరిని యధావిధిగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2014 ముందు రాష్ట్ర ఉద్యమ నాయకుడిగా ఉన్న కేసీఆర్ ఆనాడు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానం ఆంధ్ర నాయకులు తెచ్చినదని చంద్రబాబు తెచ్చిన ఈ విధానాలను 18 అడుగుల లోతులో పూడ్చి పెడతానని ప్రగల్భాలు పలికారని అన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంఎస్‌ను పర్మినెంట్ చేయకుండా మళ్లీ రీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు రాయాలి అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ విధించిన షరతులు బేషరతుగా ఉపసంహరించు కొని కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన గ్రామస్థాయిలో అనేక ఇబ్బందులను ఓర్చుకొని రాష్ట్ర ప్రభుత్వానికి పేరు తెస్తూ కరోనా కష్టకాలంలో కూడా రెండు సంవత్సరాలు కష్టపడి ప్రాణాలకు తెగించి పనిచేసిన ప్రభుత్వం గుర్తించక పోవడం దుర్మార్గమని అన్నారు. కరోనాకాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది అందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ వారి శ్రమను గుర్తించకుండా వారిని పర్మినెంట్ చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. గ్రామాల్లో వ్యాక్సినేషన్, ఎన్ సి డి, పిఎన్ సి ల విసిట్, టిబి కేసులు, లెప్రసీ ప్రతి నెల 100 శాతం కావాలని పై అధికారులు ఏఎన్ఎం పై ఒత్తిడి చేస్తూన్నారని, ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొని పనిచేస్తున్నా పర్మినెంట్ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఎగ్జామ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు పుష్ప కవిత, గంగా జమున, స్వర్ణ, సరోజ, లలిత, విక్టోరియా, సుశీల, ఇంద్ర, లక్ష్మీ, గంగామణి, విజయ, రేణుక, జ్యోతి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అలీకి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ లక్షా 25వేల చెక్కును ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఒలంపిక్ అధ్యక్షులు మరియు నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, మోచ్చ శ్రీనివాస్, ముత్తన్న, సర్పంచులు ఉప సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన డాక్టర్ మధుశేఖర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్పర్సన్‌గా నియమితులైన డా. మధు శేఖర్ శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి మధు శేఖర్ కు శుభాకాంక్షలు తెలిపారు.



సీఎంకు బొకేను అందజేస్తున్న మధుశేఖర్

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

- 19 నుంచి 30వరకు గడువు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ వారి పారిశ్రామిక శిక్షణా కేంద్రాలలో (ఐ.టి.ఐ) ఉచితంగా అడ్మిషన్ పొంది వివిధ పారిశ్రామిక కోర్సులలో శిక్షణ పొందడానికి 2023 సంవత్సరానికి మూడో దఫాలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 19 నుండి 30 వరకు జరుగుతాయని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టి.ఐ) (బాలుర), నిజామాబాద్ ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నిజామాబాద్ జిల్లాలో ఐదు (5) ప్రభుత్వ ఐటిఐలలో, మూడు (3) ప్రైవేటు ఐటిఐలలో మిగిలిఉన్న సీట్లకి దరఖాస్తూ చేసుకోవాలని పేర్కొన్నారు. 14 సం.. పైబడిన అభ్యర్థులు అర్హులని అడ్మిషన్లకు వయస్సు పరిమితులు లేవని తెలిపారు. నోటిఫికేషన్, వివిధ కోర్సుల విద్యార్హతలకు website: https://iti.telangana.gov.in చూడాలని సూచించారు. ఇంతకు ముందు రిజిస్టర్ చేసుకున్నా వారు కేవలం వెబ్ ఆప్షన్స్ పెట్టాలని సూచించారు. వెబ్ సైట్లో రిజిస్టర్ చేసుకుని కోర్సు ప్రాతిపదికన వెబ్ ఆప్షన్స్ పెట్టి ఒరిజినల్ సర్టిఫికేట్లు స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు. సీటు పొందడానికి మరిన్ని ఐ.టి.ఐలు, కోర్సులను వెబ్ ఆప్షన్స్ పెట్టాలని పేర్కొన్నారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వెబ్ ఆప్షన్స్ ఆధారంగా సీట్లు కేటాయించబడుతుందని తెలిపారు. వివరాలకు సెల్: 9948195654, 9490057403 సంప్రదించాలని తెలిపారు.

ఈస్ట్ బ్యాంకు కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని నాలుగవ డివిజన్ పరిధిలో ఉన్న ఈస్ట్ బ్యాంకు కాలనీ లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శుక్రవారం తెలిపారు. రామారావు చౌహన్ గౌరవ అధ్యక్షులుగా, పి.శ్రీకాంత్ అధ్యక్షులుగా, మల్లెపూల నరసింహ చారీ సహాధ్యక్షులుగా, రాథోడ్ దయసింగ్ కార్యదర్శిగా, సి హెచ్.రాజయ్య కోశాధికారిగా, సునీల్, లక్ష్మీకాంత్, ధర్మరాజు, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులుగా దివాకర్ రాథోడ్, రేగుంట గణేష్, నారాయణ శెట్టిని ఎన్నుకున్నట్టు చెప్పారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కొండా శ్రీనివాస్, ముజ్జ భాస్కర్, సాంస్కృతిక కార్యదర్శులుగా విజయ్, గిరీష్, ప్రచార కార్యదర్శులుగా మల్లెపూల నవీన్, ఇంగు శ్రీనివాస్, మహిళ సభ్యులుగా ఆశ, ఛాయ, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో స్వేరోస్ పదం చేర్చడం పట్ల హర్షం

నవతెలంగాణ-ఆర్మూర్

స్వేరోస్ పదాన్ని ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలో చేర్చడం పట్ల సాయి స్వేరోస్ రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ హర్షం వ్యక్తం చేశారు.ా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2012లో ప్రారంభమైన స్వేరోస్ నేడు విశ్వ వ్యాప మైనందుకు సంతోషంగా ఉదరని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ బ్రైన్ చైల్డ్ ఒక్కడిగా మొదలై కోట్లాదిమందిని తాకి స్వేరోయిజం ఖండంతరాలకు వ్యాప్తి చెందిందన్నారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవాల సాధనే లక్ష్యంగా తెలుగు నేలపై. పురుడుపోసుకున్న మహా విప్లవానికి ఆక్స్ ఫర్డ్ డిక్షనరిలో చోటు లభించిందన్నారు. వారం రోజుల్లోపు రిలీజయ్యే లేటెస్ట్ వర్షన్లో ఈ పదం కనిపించనుందని తెలిపారు.

నెరవేరిన పేదవిద్యార్థుల కల

రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, కమ్మర్ పల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఏర్పాటుతో విద్యార్థుల కల నెరవేరిందని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి బాల్కొండ నియోజకవర్గ ప్రజలు, పేద విద్యార్థిని విద్యార్థుల పక్షాన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, కమ్మర్ పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పోరాటం ఫలితంగానే డిగ్రీ కళాశాల మంజూరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పోరాటం ఫలితంగానే డిచ్‌పల్లికి డిగ్రీ కళాశాల మంజూరైందని పీడీఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ అన్నారు. శుక్రవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించే విధంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషి చొరవ చూపారని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిర్మాణ పనులను మొదలుపెట్టి వచ్చే విద్యా సంవత్సరం మార్చిలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతులు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సలీం, శీను, నందు, మహిపాల్ అశ్విత్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో హెల్త్ సెంటర్‌లో ఎంబిబిఎస్ డాక్టర్ ను నియమించాలని భారతీయ విద్యార్థి మోర్చ బివియం ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి కి శుక్రవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి (తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి) బివియం విఠల్ మాట్లాడుతూ హెల్త్ సెంటర్లలో డాక్టర్ లేకపోవడంతో అనారోగ్య సమస్యలు వస్తే హెల్త్ సెంటర్ కి వెళ్లితే అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండరని, పేరుకే హెల్త్ సెంటర్ తప్ప కనీస సదుపాయాలు లేవన్నారు. టెస్టుల కోసం వెళితే అక్కడ టెక్నీషియన్, పరికరాలు కూడా అందుబాటులో లేవన్నారు.పూర్తి స్థాయి ల్యాబ్ పరికాలను అందుబాటులో ఉంచి ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. నూతన బాలికల వసతి గృహాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్చార్జి సూరజ్, వరుణ్, నాయకులు యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్స్‌లో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎంఎస్‌సి ఐదుసంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్స్‌లో చేరడానికి స్పాట్ అడ్మిషన్ ఈనెల 23, నాగారంలోని గిరిజన గురుకుల మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఈనెల 20న స్పాట్ ప్రక్రియ ఉంటుందని నిజామాబాద్ ట్రైబల్ వెల్ఫే డిగ్రీ కాలేజ్ నిజామాబాద్ ప్రిన్సిపల్ సైదా జైనాబ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసుకున్న ఎంపీసీ, బైపిసి మహిళా అభ్యర్థులు ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల షాద్ నగర్, పురుష అభ్యర్థులు ట్రైబల్ వెల్ఫేర్ నాగర్ కర్నూల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. నిజామాబాద్ నాగారంలోగల గిరిజన గురుకుల మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి స్పాట్ ప్రక్రియ ఈనెల 20 ముగియనున్నదని పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి అయిన మహిళా అభ్యర్థుల స్పాట్ అడ్మిషన్ తీసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు బి జడ్ సి-7075234130, ఎంజడ్‌సి-9553964680, బి బి ఏ-9490289443, ఎం పి సి ఎస్ -7729095829, ఎంఎస్‌టిసిఎస్-7095898603 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆన్‌లైన్ పరీక్ష విజేతలు వీరే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

స్టేట్ టీచర్స్ యూనియన్ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆన్లైన్‌లో భారతదేశ అంతరిక్ష యానం-విజయాలు అనే అంశం పైన నిర్వహించిన పరీక్షల్లో విజేతలను ప్రకటించారు. ముప్కాల్ జడ్‌పిహెచ్ఎస్ ప్రశాంత్, ఆర్మూర్ టీఎస్ఎంఎస్ ఏ. వేద శ్రీ, నెహ్రూనగర్ జీహెచ్ఎస్ అనాబియ, బోర్గం జడ్పిహెచ్ఎస్ యశస్వి, వేల్పూర్ జెడ్‌పిహెచ్ఎస్ అనసూయ విజేతలుగా నిలిచారని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, గంగాకిషన్, ముద్దుకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-వేల్పూర్

మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో స్పాట్ అడ్మిషన్లు శనివారం ఉంటాయని ఇన్చార్జి ప్రిన్సిపల్ యం. సప్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్ భరోసా నిచ్చారు. శుక్రవారం సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. మూడు రోజులుగా తమ డిమాండ్లు నేరవెర్చాలని కార్మికులు సమ్మె చేస్తున్నా చర్చలకు పిలవకపోవటం చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏంటో అర్థం అవుతుందని అన్నారు. సమ్మె చేసుకోడానికి ఒక గంట ముందు డ్యూటీల నుండి రిలీవ్ చేయమని అడిగితె కమిషనర్, చైర్మన్ వారి పని సమయాన్ని ఇంకా గంట పెంచుతాం అనడం వారి అహంకారానికి నిదర్శనం అని అన్నారు. 12వ పీఆర్‌సీ ప్రకారం 26వేల వేతనం, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయటం, ఎనిమిది నెలలుగా పెండింగ్ లో ఏరియర్స్ డబ్బులు ప్రతినెల 3500 చొప్పున ఇవ్వాలని, మే డే నుండి పెంచిన వెయ్యి రూపాయలు చెల్లించాలని అన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, ఉద్యోగ సమయంలో కార్మికులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే మున్సిపల్ వారే పూర్తి బాధ్యత తీసుకోవాలని, వారానికి ఒకరోజు పూర్తిగా సెలవు ఇవ్వాలని అన్నారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఉండవని కేసీఆర్ అన్నారని,కాని ఆర్మూర్ మున్సిపాలిటీలో 98శాతం ఉద్యోగులు కాంట్రాక్ట్ వారే అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మీర్ మాజీద్, జిమ్మి రవి, మందుల పోశెట్టి, మీసాల రవి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న కోలా వెంకటేష్

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

- ఆలయ కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి ఖిల్లా రామాలయం, బీబీపూర్ తాండ వయా మాక్లూర్ తాండ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 4.50 కోట్లతో ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రహదారులు, భవనముల శాఖ నిధులతో డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం శ్రీ సీతారామస్వామి మందిరం వరకు అప్రోచ్ రోడ్డు 97.50 లక్షలలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఆయన వివరించారు. అనంతరం డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ నూతన కమిటీకి మంజూరు పత్రాలను అందజేశారు. నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అధ్యక్షులు, నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, మండల పార్టీ అధ్యక్షులు చింత శ్రీనివాస్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జీనియస్ నారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సాయిలు, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు అమీర్ ఖాన్, టిఆర్ఎస్వి యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, సర్పంచులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం జూనియర్ కాలేజీ మంజూరు చేయడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు బాణసంచా కలసి సంబరాలు చేసుకున్నారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ ఆధ్వర్యంలో హస కొత్తూర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంతి రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నూతన తహసీల్దార్‌గా రమేష్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-వేల్పూర్



మండల నూతన తహసిల్దార్‌గా యం. రమేష్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ పని చేసిన రాజేందర్ ని ప్రభుత్వం కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అదిలాబాద్ తహసీల్దార్‌గా పని చేసిన,ఎం రమేష్‌ను వేల్పూర్ తహసీల్దార్ గా బదిలీ చేసింది. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. నూతన తహసీల్దారును సిబ్బంది. శాలువాతో సన్మానించారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ -4 కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తు ప్రభుత్వం జీవో జారీ చేసింది. అందకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను మోర్తాడ్ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మండల కార్యదర్శులకు డిపిఓ శ్రీనివాస్ అందజేశారు. పనిని గుర్తించి తమకు పదోన్నతులు కల్పించడం పట్ల కార్యదర్శులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యంపిడిఓ రాజేశ్వర్, యంపిఓ గంగమోహన్, పంచాయతీ కార్యదర్శులు శేఖర్,గణేష్, రాజు, కిషన్, వినీల్, సంజయ్, అనుష ఉన్నారు



ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న అధికారి

మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలుగా చుక్కబట్ల గంగామణి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ మహిళ సెల్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామానికి చెందిన చుక్కబట్ల గంగమణికి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా నియామక పత్రం శుక్రవారం అందజేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్‌వాయి మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా ఇందల్‌వాయి మండలకేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మిని మండల కాంగ్రెస్ మహిళశాఖ అధ్యక్షురాలిగా నియామకపత్రం అందజేశారు. నిజామాబాద్ కాంగ్రెస్ భవన్‌లో నియామక పత్రాలను అందజేశారు. జిల్లా కిసాన్ కేత్ ముప్పగంగా రెడ్డి, డిసిసి సెక్రెటరీ భాస్కర్ రెడ్డి,ఇందల్ వాయి మండల పార్టీ అధ్యక్షులు మోత్యారి నవీన్ గౌడ్, కిసాన్ కేత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, మైనార్టీ మండల సెల్ అధ్యక్షులు జమీల్ పాష తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతి

నవతెలంగాణ- డిచ్‌పల్లి

తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యే బాగరెడ్డి గోవర్ధన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఇతర రాష్ట్రాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తే తెలంగాణ రాష్ట్రంలో పట్టించుకో వడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

నాగపూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో 77వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రెండు రోజులపాటు కొనసాగిన వాలీబాల్ పోటీలలో విజేతలకు గురువారం రాత్రి బహుమతులను అందజేశారు. బహుమతులను గ్రామానికి చెందిన ప్రవీణ్ తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువతను క్రీడల్లో ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాగపూర్ వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు కార్తీక్, శ్రీనివాస్, చందు, గణేష్, రవికిరణ్, రాము, రాకేష్, మధు, శ్రీకాంత్, రాజకుమార్ నందు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పీఆర్టియూ సభ్యత్వ నమోదు ప్రారంభించినట్లు పీఆర్టియూ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు శేర్ల శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్టియూ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టియూ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ ఇంచార్జ్ లక్ష్మణ్ పటేల్, వేల్పూర్ మండలాధ్యక్షులు గంట అశోక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడూరి లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బిజ్జి గోపి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ రెడ్డి, ఘటాడి భాస్కర్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని దేగం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపించిన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీపీ మోతే రామాగౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ... బహుజన కులవృత్తులకు పెద్దన్నగా నిలిచిన మహారాజ్ సర్వాయి సర్దార్ పాపన్న అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం టిడిపి పార్లమెంటు అధ్యక్షుడు దేగాం యాదగౌడ్, గ్రామ ఉపసర్పంచ్ గడ్డం గంగారెడ్డి ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, ప్రమోద్, బీసీ జిల్లా నాయకులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

బోర్గాంలో గొర్రెలు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలం బోర్గం గ్రామంలో శుక్రవారం గొర్రెలు పంపిణీ చేశారు. గ్రామానికి 13 గొర్రెల యూనిట్లు వచ్చాయని డాక్టర్ విట్టల్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్ధవాని సాయిరెడ్డి, జడ్పిటిసి మేక విజయ సంతోష్, ఎంపీటీసీ రుక్మిణి, ఉప సర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, సింగిల్ విండో చైర్మన్ మొయినొద్దిన్, డైరెక్టర్ కదిర్ పాషా, నజీముద్దిన్, ఆశాడి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.


గొర్రెలు పంపిణీ చేస్తున్న డాక్టర్ విఠల్

ఫర్టిలైజర్ షాపులో సంచులు పడి గుమాస్త మృతి

నవతెలంగాణ-గాంధారి

ఫర్టిలైజర్ షాప్‌లో ప్రమాదవశాత్తు సంచులు మీదపడి గుమాస్తా మృతిచెందాడు. ఈ ఘటన గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బుర్రిరాజశేఖర్(29) మండల కేంద్రంలోని రామకృష్ణ ట్రేడింగ్ కంపెనీ ఫెర్టిలైజర్ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు సంచులు జారిపడి ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించిచగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. మతుని భార్య సంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

అరాచకాలను ఎదురించిన యోధుడు

- ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

దొరల అరాచకాలను ఎదిరించిన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని పలువురు కొనియాడారు. శుక్రవారం పలుచోట్ల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

పిట్లం : మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బహుజనుల హక్కు కొరకు బహుజన రాజ్యాధికార దిశగా పోరాడి మొగలాయి దౌర్జన్యాలను బెదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడన్నారు. స్వరాష్ట్రంలో సగర్వంగా అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించుకోవడం రాష్ట్రంలోని బహుజనులందరికీ గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ నవాబ్ మైపా లిగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


బోధన్ : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ కులస్తులు


మాచారెడ్డిలో..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంతో పాటు కాటేపల్లి, అంజని, బేగంపూర్, కాస్లాబాద్ గ్రామాలలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 373వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జై గౌడ సంఘం మండల అధ్యక్షులు విటల్‌గౌడ్, జై గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పండరి గౌడ్, మండల ప్రధాన కార్యద ర్శి రమేష్‌గౌడ్, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఏఎస్ఐ రాములు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు తిరుమలరెడ్డి, సర్పంచ్‌లు విఠల్, శివరాం, శోభ, ఉపసర్పంచ్ లక్ష్మాగౌడ్, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, ఇందల్ సింగ్, జ్యోతి, గౌడ సంఘం ఆయా గ్రామాల అధ్యక్షులు రామాగౌడ్, లక్ష్మాగౌడ్, సాయాగౌడ్, సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రమేష్, సభ్యులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలో తల్లి తెలంగాణ ప్రాంగణంలో సర్దార్ సర్వాయి పాపన్న 313వ జయంతిని పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, ఉషగౌడ్, అరవింద్ గౌడ్, నారగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ సంఘం పెద్దలు, యువకులు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోటగిరి : కోటగిరి గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ 373 జయంతి వేడుకలను కోటగిరిలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కోటగిరి గీత పరిశ్రమ సహకార సంఘం భవనంలో గౌడ కులస్తులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎ.గంగాప్రసాద్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర గీత పనివార సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ విటల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఫోటో వార్త వేయగలరు

బోధన్ : సాయుధ తెలంగాణ ఉద్యమకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సాలూర మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములను ఎదిరించి పోరాడిన మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవింద గౌడ్, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ రాజా గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వామి గౌడ్, మల్లెపూల లక్ష్మణ్ గౌడ్, రాజాగౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి : మండలంలోని గజయనాయక్ తాండ ఎక్స్‌రోడ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాచారెడ్డి గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను గురించి గుర్తు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు సిద్ధగౌడ్, మురళిగౌడ్, స్వామిగౌడ్, ఎల్లగౌడ్, రామగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి పీఆర్టీయూ భరోసా


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ ఉపాధ్యాయులు ఉదయ్ దత్ స్వాతంత్ర్య దినోత్సవం ఆకస్మికంగా మరణించారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. పిఆర్‌టియులో క్రియాశీల సభ్యత్వం ఉన్నందున ఎమ్మెల్సీ రగోత్తంరెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ పాల్‌రెడ్డి, కమలాకర్‌రావు చేతుల మీదుగా లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకుముందు ఉపాధ్యాయ వృత్తిలో ఉదయ్ దత్ చేసిన సేవలు గురించి కొనియాడి, శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, కుషాల్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌చారి, గిరిధర్, మండల విద్యాధికారి ఎల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం, సీఓ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. రెంజల్ గ్రామానికి చెందిన సత్యనారాయణకు రూ.15వేలు, సిహెచ్ పోశెట్టికి రూ..32వేలు, కె.సాయిలుకు రూ.40వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఫీక్, అనిల్, అగ్గు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ముందు డ్రైనేజీని శుభ్రం చేయాలి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలోని శివాలయం ముందు నుంచి వెళ్లే డ్రైనేజీ శుభ్రం లేకపోవడంతో దుర్గంధం ఏర్పడుతుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు తెలియ జేశామని వారు పేర్కొన్నారు. ఈ మురికి నీరు ఇండ్లలోకి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మురికి కాలువలు శుభ్రం చేయించాలని వారు కోరారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరఫీ పరీక్షలు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని భవిత సెంటర్లో విద్యనభ్యసిస్తున్న వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ విశాలాక్షి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెంటర్లోని 8 మంది వికలాంగ విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించి, తగు సూచనలు చేశారు. ఫిజియోథెరపీ పరీక్షల వల్ల విద్యార్థుల అవయవాల్లోవం ఉపశమనం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు అమృతం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

ముర్రుపాలు అమృతమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ముఖ్యఅతిథిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి శ్రీనివా సరెడ్డి మాట్లాడుతూ.. ముర్రిపాలు అమృతమైనవని తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన అరగం టలోపే తల్లిపాలు అందించాలని తెలుపుతూ, పుట్టిన ప్పుడు శిశువు ఎన్ని కిలోలు ఉండాలని అంగన్వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు, గర్భిణీ స్త్రీలకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆసక్తిగా తల్లిపాల విశిష్టతను ఉదాహరణ పూర్వకంగా వివరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ నెంబర్ లక్ష్మి మాట్లాడుతూ మహిళలు మనోవేదనకు గురి అవుతున్న సందర్భాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయని, మహిళలు ఎదుర్కొం టున్న సమస్యలను నిర్భయంగా తెలపాలని, చెప్పిన విషయాలు బహిరంగపరచకుండా కాపాడుతామని పేర్కొన్నారు. సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్ భార్య అయేషా ఫాతిమా, రాష్ట్ర మహిళా కమిషనర్ నెంబర్ సుధామీ లక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టర్ రసూల్ బి, సిడిపిఓ జానకి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దీపక్, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, జెడ్పీటీసీ శంకర్ పటేల్, జెడ్పిటిసి కోఆప్షన్ సిరాజుద్దీన్, ఏఎంసీ అబ్దుల్ వహీద్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-బిచ్కుంద

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మాణం చేసుకోవడానికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించడంతో ఇల్లు లేని నిరుపేదలు భారీ ఎత్తున మహిళల పేరున దరఖాస్తులు చేసుకున్నారు. బిచ్కుంద మండలంలోని ఆయా గ్రామాలలో మొత్తం 1,204 దరఖాస్తులు రాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించేందుకు గ్రామస్థాయిలో గ్రామ కార్యదర్శులు వివరాలు సేకరించి సర్వే నిర్వహించారు. కచ్చితంగా ఇంటి స్థలం 100 గజాల్లోపు ఉండాలని రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్‌కార్డు, స్థానికులా కాదా, స్థలం మహిళల పేరు మీద ఉండాలని నిబంధనలను తదితర విషయాలను పరిశీలించారు. బిచ్కుంద మండలంలో గృహలక్ష్మి పథకం కింద 1,204 దరఖాస్తులు రాగా గ్రామాల వారీగా బండరేంజ్‌లో 18, బిచ్కుందలో 340, పెద్దదడ్గీలో 41, చిన్నదడ్గీలో 27, పెద్ద దేవాడలో 23, చిన్నదేవాడ 20, దౌల్తాపూర్‌లో 4, ఫత్లాపూర్‌లో 25, గోపన్‌పల్లిలో 23, గుండెకల్లూరులో 23, గుండెనెమలిలో 4, హస్గుల్‌లో 110, కందరపల్లిలో 35, ఖత్గాంలో 40, మాన్యాపూర్‌లో 5, మెక్కలో 14, మిషన్ కళ్యాలీలో 46, పుల్కల్లో 178, రాజాపూర్‌లో 24, రాజుల్లాలో 50, సిత్రంపల్లిలో 16, శాంతాపూర్‌లో 65, షెట్లూరులో 29, సిర్‌సముందర్‌లో 10, పెద్దతక్కడపల్లిలో 18, వాజిద్‌నగర్‌లో 57, ఎల్లారం గ్రామంలో 19 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సర్వే నిర్వహణ పరిశీలించిన అధికారులు..

మండలంలోని ఆయా గ్రామాల్లో గృహలక్ష్మి సర్వే కార్యదర్శులు, సిబ్బంది నిర్వహిస్తుండగా ఎంపీడీవో ఆనంద్, మండల పంచాయతీ అధికారి మహబూబ్ మండలంలోని పుల్కల్, పెద్దదేవాడ, బిచ్కుంద గ్రామాలలో సర్వే నిర్వహణ పరిశీలించారు. దరఖాస్తుదారుల ఖాళీస్థలాన్ని, ఓటర్ ఐడీకార్డు, ఆధార్‌కార్డు, వారు స్థానికులా కాదా తదితర వివరాలు పరిశీలించి పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈనెల 20వ తేదీ లోపల సర్వే పూర్తి చేసి పూర్తి వివరాలతో గృహలక్ష్మి సర్వే రిపోర్ట్ కార్యాలయంలో సమర్పించాలని పరిశీలించిన దరఖాస్తులు జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందని అధికారులు తెలిపారు.


దరఖాస్తుల సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

బీటీఎస్ జాతీయ రహదారి వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ, బీబీపేట్ మండల ప్రజలు, ప్రయాణికుల సౌకర్యం కోసం బీటీఎస్ జాతీయ రహదారి వద్ద అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మాణం చేయాలని కోరుతూ కామారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎంపీ బీబీ పాటిల్‌కు జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకొండ, బీబీపేట్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు, ఆయా కళాశాలల విద్యార్థులు నిత్యం కామారెడ్డి జిల్లా కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తున్నారని, బీటీఎస్ జాతీయ రహదారి వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడంతో భారీ వాహనాలు అయినా ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రయివేట్ వాహనాలు జాతీయ రహదారి యూ టర్న్ కోసం భిక్నూర్ వద్ద ఉన్న టోల్ ప్లాజా వద్ద నుంచి వాహనాలు యూ టర్న్ అయి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, ప్రయాణికులకు సమయభారం పడుతున్నారని ఈ సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే బీటీఎస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ

కురుమ సంఘం కళ్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని పొందుర్తి గ్రామ కురుమ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు కురుమ సంఘం కళ్యాణ మండపం నిర్మాణం పూజ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ ఇంచార్జ్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కురుమసంఘం సభ్యులు, మండలాధ్యక్షులు దేవి రెడ్డి, గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షులు సంపత్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు రాజు, పొందుర్తి అధ్యక్షులు కుమ్మరి రమేష్, సాయిరెడ్డి, రాము, దుర్గాప్రసాద్, మండల ఐటీ సెల్ కన్వీనర్ జంగం మనోహర్, వివిధ గ్రామాల కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరమణారెడ్డి

పిట్లంలో సీనియర్ జర్నలిస్ట్ మృతి

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్



మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మండలి ప్రశాంత్ (48) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకుల కథనం మేరకు ఆయన కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆయనను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఓ ప్రైయివేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఆయన మృతితో మండల కేంద్రంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

సంతాపం వ్యక్తం చేసిన..

మద్నూర్ : పిట్లం మన తెలంగాణ విలేకరి మండలి ప్రశాంత్ గుప్తా అకాల మరణం జర్నలిజానికి ఒక తీరని లోటని ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. జర్నలిస్టు మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు హనుమాన్లు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సంగయ్యప్ప, మండల ఉపాధ్యక్షులు శివాజీ అప్ప, మండల కమిటీ సలహాదారులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణపటేల్ తదితరులు పాల్గొన్నారు.


మద్నూర్ : నివాళులర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ

బోధన్ గురుకులంలో ఇంటర్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బెల్లాల్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులలోని సీట్ల భర్తీకై విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పూర్ణచందర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 19న కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు. మార్చి 2023లో జరిగిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి రెండు లక్షల లోపు ఉండాలని, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి 1,50,000 లోపు ఉండాలని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఆగస్టు19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఖాళీల సంఖ్య, రిజర్వేషన్, పదవ తరగతిలో సాధించిన జీపీఏ ఆధారంగా అదే రోజు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను వెంటనే సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్ 7995010658ను సంప్రదించాలని తెలిపారు.

నేడు ఎల్లారెడ్డిలో 5కే రన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలో ఉదయం 6 గంటలకు 5కే రన్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ రమేష్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలాల వారీగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఐవోట్ ఫర్ సుర్ అనే అంశంతో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్విప్ యాక్టివిటీలో భాగంగా 5కే రన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ 5కే రన్‌ను అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ మీదుగా మెడల్ స్కూల్ పాఠశాల వరకు కొనసాగుతుందని తెలిపారు. సమస్త ప్రజానీకం అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

ఆగస్టు 31 వరకు ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఈనెల ఆగస్ట్ 31 వరకు నమోదు చేసుకోవచ్చని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దకొడప్‌గల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గంగాకిషన్ తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 10వ తేదీనే గడువు ముగిసినప్పటికీ విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నెల 31 వరకు అపరాధ రుసుముతో ప్రవేశం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని మధ్యలో చదువు మానేసిన వారు, పదవ తరగతి పాసైన వారు ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

వీరన్నగుట్ట మైనార్టీ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలోని మైనారిటీ కాలనీ గత మూడు రోజులుగా పగిలిపోయి చుక్కా నీరు రావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచికి, గ్రామ కార్యదర్శి ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదని వారన్నారు. త్వరలో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

కొల్లూర్‌లో పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండలంలోని కొల్లూరు గ్రామంలో శుక్రవారం ఉచిత గాలికుంటు నివారణ టీకాలను డాక్టర్ సురేష్ ఆధర్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సంపత్, అటెండర్ లక్ష్మీ, గోపాల మిత్రులు నగేశ్, సాయిలు, ఇంకా పశుపెంపకందారులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్టు గాంధారి ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన పానకంటి సురేష్ అనే వ్యక్తి 16-08-2023న రాత్రి తన ఇంటి ముందు మోటార్ సైకిల్‌ను పార్క్ చేసి పడుకోగా ఉదయం లేచిచూసే వరకు మోటార్ సైకిల్ కనిపించలేదు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గాంధారి ఎస్సై డి.సుధాకర్ ఆ మోటార్ సైకిల్‌ను దొంగతనం చేసి మెదక్ జిల్లా నర్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి సింగజోగి మోహన్ (27)ను పట్టుకొని అతని వద్ద నుంచి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసి జైలుకు పంపినట్టు ఎస్.ఐ సుధాకర్ తెలిపారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోండి

నవతెలంగాణ-సిరికొండ



18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోకుంటే, వెంటనే నమోదు చేసుకోవాలని తహసిల్దార్ రవీందర్ రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఓటు యువతకు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు నమోదు చేసుకొని వారు తక్షణమే నమోదు చేసుకోవాలని కోరారు. రెవెన్యూపరమైన సమస్యలు ఏమి ఉన్న తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

మధు శేఖర్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



రాష్ట్ర హెల్త్ డిపార్మెంట్ చైర్మన్ మధు శేఖర్‌ను మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి శుక్రవా రం సన్మానించారు. ఆర్మూర్ పట్టణంలోని ఏంజే హాస్పి టల్‌లో ఆయన్ను కలిసి పూలమాలతో సన్మానించి అభినందించారు.

సర్పంచుకు పరామర్శ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన మహిళ సంఘ నాయకురాలు వనజ శుక్రవారం ఇటీవల ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించిన కల్లెడ సర్పంచ్ లావణ్య ప్రసాద్ గౌడ్‌ను పరామర్శించారు.. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండగా ఉంటామని తెలిపారు.

గడప గడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-ధర్పల్లి



మాట్లాడుతున్న నగేష్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో మండలంలోని డీబి తండా, దుబ్బాక గ్రామాల్లో టీపిసిసి కార్యదర్శి నగేష్ రెడ్డి గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్య క్రమం నిర్వహి ంచారు. ఇంటింటికి తిరుగుతూ పార్టీ భవిష్యత్తులో ప్రజలకోసం చేసే కార్యక్ర మాలపై వివరించారు. గ్రామాల్లో పార్టీ జెండా ను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లోని యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, జాన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, చెలిమేలా నర్సయ్య, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

నుడా చైర్మన్‌ని కలిసిన సాంబార్ మోహన్

నవతెలంగాణ-మోపాల్



నుడాచైర్మన్‌ను సన్మానించిన నాయకులు

మండలంలోని బోర్గం (పి) గ్రామంలో చైర్మన్ ఈగ సంజీవరెడ్డిని ఉమ్మడి జిల్లా ఐసిడిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ శుక్రవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఎంపిటిసి ముత్తెన్న, కెంపు భూమయ్య సంజీవరెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు.

ఎస్ఐగా ఎంపికైన జీవన్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-మోపాల్



సన్మానిస్తున్న రెడ్డిసంఘం సభ్యులు

కష్టపడి సివిల్ ఎస్సైగా జాబ్ సాధించిన మండలంలోని బోర్గం పి గ్రామ వాసి అయిన జీవన్ రెడ్డి దంపతులను మోటాడి రెడ్డి సంఘం సభ్యులు సన్మానించారు. శుక్రవారం మోటాడిరెడ్డి సంఘంలో జీవన్‌రెడ్డి దంపతులు, వారి తల్లిదండ్రులను కూడా సన్మానించారు. జీవన్ రెడ్డి ఇంతకుముందు ఆర్మీలో పనిచేసే దేశానికి గర్వకారణంగా నిలిచారన్నారు. ఇప్పుడు ఎస్ఐ ఉద్యోగం సాధించడం గర్వకారణమని మండల రెడ్డి సంఘం సభ్యులు అన్నారు.

పెన్షన్ పెంచే వారికే మా ఓటు

- పెన్షనర్స్



స్టిక్కర్లు ఆవిష్కరించిన పెన్షనర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ పెంచే వారికి మా ఓటు అని పెన్షనర్లు ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మౌనం వీడి ఈపీఎస్ పెన్షనర్లకు నెలకు 9000 రూపాయలు పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం నాందేవ్ వాడలోని సంఘ భవనంలో నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. రాబోయే ఎన్నికలలో ఈపీఎస్ పెన్షనర్లకు తొమ్మిది వేల రూపాయలు పెంచుతామని హామీ ఇచ్చిన వారికే తమ ఓటు వేస్తామని, దేశవ్యాప్తంగా నున్న 80 లక్షల మంది ఈ పీ యస్ పెన్షనర్లు ఈ ప్రతిజ్ఞ పూనారని జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు నో ఇంక్రీజ్ ఇన్ పెన్షన్ నో వోట్ స్టిక్కర్లను విడుదల చేశారు. లక్షల కోట్ల ఈపీఎస్ పెన్షన్ నిధిని ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఈ నిధిని కాపాడుకుంటామని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పీఆర్‌సి డిఏ ల విడుదలపై దొంగాట ఆడుతుందని, ఇదిగో అదిగో అంటూ ఉద్యోగులను, పెన్షనర్లను మోసం చేస్తోందని వారన్నారు. జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయరావు, కార్యదర్శి మదన్మోహన్, ఉపాధ్యక్షులు భోజారావు, జార్జ్, ప్రసాదరావు, అందే సాయిలు, నరసింహస్వామి, అద్దంకి ఉషన్, పురుషోత్తం, శిర్ప హనుమాన్లు, రాధా కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

437 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్



టీకాలు వేస్తున్న వైద్యులు

మండలం లోని చిన్నపూర్ గ్రామంలో గల గోశాలలో గల 437 పశు వులకుగాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వైద్యులు కిరణ్ దేష్ పాండే, ఉమ్మమ సహెర్ బేగం అధ్వర్యంలో శు క్రవారం వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, పశువైద్య సిబ్బంది విఎల్‌ఓ టి. వినీత, జేవిఓ గంగజమున, విఏ పాషా, ఆఫీస్ సబార్డినేట్స్ శ్రీనివాస్, సజ్జత్, గోపాల మిత్రులు బేగ్, దిలీప్ పాల్గొన్నారు.

వేణుకిషన్ నగర్ తండాలో బూత్ కమిటీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని వేణు కిషన్ నగర్ తండాలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీని శుక్రవారం నాయకులు వేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం, ధీరత్వం.. సర్వాయి పాపన్నగౌడ్

- ఘనంగా జయంతి వేడుకలు

నవతెలంగాణ-విలేకరులు



కమ్మర్‌పల్లి : నివాళ్లు అర్పిస్తున్న గౌడకులస్తులు



కంఠేశ్వర్:మాట్లాడుతున్న వెంకట్రాములు



ఏర్గట్ల: తొర్తిలో నివాళ్లు అర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

కమ్మర్‌పల్లి:మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలను గౌడ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో గౌడ యూత్ సభ్యులు సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఉప్లూర్ లో గౌడ సంఘంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లిలో గౌడ సంఘం మండల అధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్, సంఘ సభ్యులు, చౌట్ పల్లి లో కౌండిన్య యువజన సంఘం అధ్యక్షులు బుర్ర నరేష్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు రమేష్ గౌడ్, సర్పంచ్ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రాజేందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు తోట శ్రీధర్, ఉప్లూర్‌లో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలో కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీ సభ్యులు రూపాల గంగారెడ్డి, తలారి మరియా సతీష్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ... సర్వాయి పాపన్న ప్రజల కష్టాలను చూసి తట్టుకోలేక బహుజన యువతను సమీకరించి ఆనాడు తెలంగాణలో ఉన్న ఏడు సంస్థానాధిపతులను ప్రత్యక్షంగా ఎదుర్కొని ఓడించి గోల్కొండ ఖిల్లాపై గౌడ్‌ల ప్రతాపాన్ని చూపించి గోల్కొండ కేంద్రంగా తెలంగాణను పరిపాలించారని అన్నారు. ఈ ప్రభుత్వం గీత కార్మికుల, గౌడ కుటుంబాలను నిర్లక్ష్యం చేస్తుందని, అందుకే గీతన్న బంధు కార్యక్రమాన్ని అమలు చేయడం లేదని, బీసీ బంధులో గౌడకులస్తులకు లక్షరూపాయల పథకాన్ని నిరాకరించిందని అన్నారు. గీతకార్మికుడు జీతగాడిగా బతికే పరిస్థితి వచ్చిందని, కల్లుగీత ఉత్పత్తుల సొసైటీలు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్పొరేషన్‌కి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. తాటి, ఈత చెట్లు పెంచుకోవడం కోసం 560 జీవో ప్రకారం ప్రతి సొసైటీకి, ఈఎఫ్‌టీ షాపుకు రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని అన్నారు. చెట్లని అభివృద్ధి, రోడ్లు వెడల్పు పేర్లతో నరికివే స్తున్న పట్టించుకోవడంలేదన్నారు. తాటి-ఈత చెట్లను కాపాడాలని తెలిపారు. సర్వాయి పాపన్న ఆశయాలను నెరవేర్చడానికి సమర శీల పోరాటాలు చేస్తామని ప్రభుత్వా నికి హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చేపూరి సాయి గౌడ్, జిల్లా నాయకులు పెద్దిసూరి, కోయడి నరసింహులు, నారాయణ గౌడ్, కిషన్ గౌడ్, శ్రీరామ్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్:సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ జయంతిని మండల గౌడ సంఘం అధ్యక్షులు పుంజు దిలీప్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనేక పోరాటాల స్ఫూర్తితో రాజ్యాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర సర్దార్ పాపన్నకు ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో పాఠ్య పుస్తకాల్లో సర్దార్ పాపన్న చరిత్ర తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్సై సుదీర్ రావు, మాక్లూర్ గ్రామ గౌడ నాయకులు, మండల గౌడ సంఘం నాయకులు ప్రహ్లాద గౌడ్, విజయ్ గౌడ్ , సత్య నారాయణ గౌడ్, చిన్న గౌడ్, నవీన్ గౌడ్, వందు గౌడ్, విజయ్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ:తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని గౌడ సంఘం నాయకులు అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు.

ఏర్గట్ల:తొర్తి, తాళ్ళ రాంపూర్ గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్ళ రాంపూర్ మోకుదెబ్బ సంఘ అధ్యక్షులు లింగాల ప్రభాకర్ గౌడ్, తొర్తి సర్పంచ్ కుండ నవీన్, ఉపసర్పంచ్ తాహెర్,తొర్తి గౌడ సంఘం అధ్యక్షులు తుపాకుల నారాగౌడ్ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

నవతెలంగాణ-బాల్కొండ



భూమిపూజ చేస్తున్న నాయకులు

బాల్కొండ మండల కేంద్రంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో శివాజీ విగ్రహం ఏర్పాటుకు శు క్రవారం భూమి పూజ నిర్వహించినట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని వన్నెల్ (బి) ఎక్స్ రోడ్డు వద్ద ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటుకు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి తన స్వంత ఖర్చుతో రూ. లక్ష 20 వేల విలువ గల చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, సర్పంచి భూస సునీత నరహరి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పిప్పెరా అశోక్, అర్కరి గంగాధర్, మాజీ సర్పంచి తౌటు గంగాధర్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు గాండ్ల రాజేష్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ వేంపల్లి పెద్ద బాల్ రాజేశ్వర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేంపల్లి చిన్న బాల్ రాజేశ్వర్, సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ గౌడ్, వార్డు సభ్యులు తోపారం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలపరిచి.. మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి

- హాస కొత్తూర్ లో గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో విద్యార్థి, నిరుద్యోగులు హాత్ సే హాత్ జోడో యాత్రకు కొనసాగింపుగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీని బలపరచండి.. మానాల మోహన్ రెడ్డిని ఆశీర్వదించండని కోరుతూ గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, మానాల మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి ప్రజలను కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు, మహిళలకు, వృద్ధులకు, విద్యార్థులకు, ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.5వందలకే గ్యాస్ సిలిండర్, పెన్షన్ రూ.4వేలు, ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా రూ.2లక్షల ఉద్యోగాలతో పాటు 18 సంవత్సరాల నుండి చదువుకుంటున్న ప్రతి విద్యార్థినికి ఎలక్ట్రిక్ స్కూటీని అందజేస్తుందని కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మండల శేఖర్, ఎన్.ఎస్.యు.ఐ తెలంగాణ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికుడు రవి మృతికి కారణమైన

అధికారులపై చర్యలు తీసుకోకంటే సమ్మె చేపడతాం

- బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మున్సిపల్ శానిటేషన్ అధికారుల వేధింపుల వల్ల శానిటేషన్ కార్మికుడు రవి ఆత్మహత్యకు చేసుకోవడంతో వారి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని బీఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్‌ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ... శానిటేషన్ కార్మికుడు రవి విషయంలో బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ఎంహెచ్ఒను కలిసి పని ఒత్తిడి తగ్గించడానికి, సర్కిల్ 5 నుండి రిలీవ్ చేసి సర్కిల్ 4బి కి బదిలీ చేయాలని కోరుతూ యూనియన్ తరుపున వినతిపత్రం అందజేసినా మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ సరిగా స్పందించలేదని ఆరోపించారు. మరింత పని ఒత్తిడి పెంచుతూ స్పెషల్ టీంకు బదిలీ చేయడంతో రవి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు. కార్పొరేషన్ మేజర్ వైఖరికి నిరసనగా 19న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రవి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించామన్నారు. కమిషనర్ లేకపోవడంతో మేనేజర్ బయటకు వచ్చి వినతిపత్రం తీసుకోవాలని కోరగా ఆయన బయటకు రావడానికి నిరాకరించారని అన్నారు. దీంతో నిరసన వ్యక్తం చేస్తూ వినతిపత్రం ఇన్ వార్డ్ లో ఇచ్చి మేనేజర్ చర్యలకు నిరసనగా నేడు చలో కలెక్టరేట్ కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బిఎల్ టియు జిల్లా అధ్యక్షులు కె.మధు, బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బి ఎల్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, ఉపాధ్యక్షులు యాదయ్య, డ్రైవర్స్ యూనియన్ నాయకులు మోహన్ గౌడ్, వాటర్ సప్లయ్ గార్డెన్స్ స్ట్రీట్ లైట్స్, డ్రైవర్స్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి గ్రామ ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ.15 లక్షలు, పెద్దమ్మ టెంపుల్‌కు రూ. 5లక్షలు ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొసీడింగ్ ఆర్డర్స్ అందజేశారు. ఎస్సీ కమ్యూనిటీ సోదరులు తమ స్థలంలో భవన నిర్మాణం చేసుకుంటామని, పెద్దమ్మ గుడి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి కోరారు. ఈ మేరకు ఆయన నిధులనుండి కేటాయిస్తూ ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను సంబంధిత ఎస్సీ కమ్యూనిటీ కుల సంఘ సభ్యులకు, మరియు దేవాలయ కమిటీ సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కమ్యూనిటీ సోదరులు, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్:ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్ ఆధ్వర్యంలో నిజామాబాద్ మండలం మల్కాపూర్ తాండకు చెందిన ఆకాష్, మోహన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వచ్చిన చెక్కులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు నాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రేమ్ నాయక్, ప్రకాష్ నాయక్, వార్డు సభ్యులు సంతోష్ పాల్గొన్నారు

రూ.7.50 లక్షలు మంజూరు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ. 7.50 లక్షలు ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను పంపిణీ చేశారు, ఎస్సీ కమ్యూనిటీ సోదరులు భవన నిర్మాణం చేసుకుంటా మని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి కోరారు. ఈ మేరకు ఆయన నిధులనుండి కేటాయిస్తూ ప్రొసీడింగ్ ఆర్డర్స్ పత్రాలను కుల సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మధుకర్ రావు పాల్గొన్నారు.

బాజిరెడ్డిని కలిసిన పెయింటింగ్ అసోసియేషన్

రూరల్ నియోజకవర్గ పెయింటింగ్ అసోసియేషన్ సభ్యులు గంగస్థాన్ పరిధిలో తమకు సొంత స్థలంలో భవన నిర్మాణం చేసుకుంటామని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి కోరారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ తొందర్లోనే నిధులు కేటాయిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్ ఉన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆదర్శప్రాయుడు

నవతెలంగాణ-సిరికొండ

భారత స్వతంత్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, తెల్లదొరల పాలిట సింహస్వప్నం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని, ఆయన మనందరికీ ఆదర్శప్రాయుడని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య అన్నారు. శుక్రవారం చంద్రబోస్ 78వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం

29న చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కార్మికుల హక్కుల కోసం, పని భద్రత కోసం, పర్మనెంట్ కోసం, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాల అమలు కోసం, 8 గంటల పని విధానం యధా విధంగా కొనసాగించాలని, నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర అధ్యక్షులు దాసు కార్మికులకు కోరారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షులు ఎండి ఖాజా మొయినుద్దీన్ అధ్యక్షతన 18న నిజామాబాద్ నగరంలోని ద్వారకా నగర్‌లోని ఐఎఫ్‌టీయూ ఆఫీసులో నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. వేతనాలు పెంపు, పర్మినెంట్ విషయంలో కేసీఆర్ ప్రభుత్వం జాప్యం మాని వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రబెల్లి దయాకర్ చర్చల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం కారోబార్లకు ప్రత్యేక హోదా మిగిలిన డిమాండ్స్ అన్నిటిని పరిష్కరించాలని గుర్తు చేశారు. మోడీ, కేసీఆర్ ప్రభుత్వాలు 2016 అక్టోబర్ 26 తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్ ఉపాధ్యక్షులు భానుచందర్ సహాయ కార్యదర్శులు నర్సింగ్ పల్లి గంగన్న, శ్యాంమ్సన్, కోశాధికారి కోటగిరి సుధాకర్, నవీన్ ,దాల్మల్కి పోశెట్టి, సొప్పరి గంగాధర్, రాజు,మచ్చర్ల చిన్న గంగారాం, రమేష్, రాంపూర్ పోసాని, రాజన్న వెంకవ్వ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంతో నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 2వ ఏఎన్ఎం, ఈసి ఏఎన్ఎంల మూడవరోజు సమ్మెలో భాగంగా శుక్రవారం పులాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం గా నిలబడి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాగ్యమ్మ, సంధ్యారాణి మాట్లాడుతూ నిత్యం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం కోసం పనిచేస్తున్న ఏఎన్ఎం ల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటు అన్నారు. క్రాఫ్ట్ అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అదే పద్ధతిన పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయమంటే నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. మాటల్లో ఏఎన్ఎంల సేవలను గుర్తిస్తూనే పని భారాన్ని మోపుతూ అనారోగ్యాలకు గురి చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందరినీ రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి సుధాకర్ పాల్గొని సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి నర్సింగరావు జిల్లా నాయకులు పి హనుమాన్లు, చక్రపాణి, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-మోపాల్



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

నూతన తహసీల్దార్ గా కాజా కుతుబుద్దీన్ శు క్రవారం డిప్యూటీ తాసిల్దార్ మునిరుద్దీన్ నుండి బాధ్యతలు తీసుకున్నారు. బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పోడు భూముల సమస్య ఉంది. కొన్ని ప్రాంతాల్లో మొరం తవ్వకాలు అధికంగానే ఉంటాయని బహిరంగ రహస్యం. కొత్తగా వచ్చిన తహసీల్దార్ దీనిని ఏ రకంగా అరికడతారో వేచి చూడాలి.

కల్లుగీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కోటగిరి

కల్లుగీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గీతా పనివాళ్ల సంఘం ఆధ్వర్యంలో కోటగిరి తహసీల్దార్ ఆఫీస్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించి, గీతా కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ సయ్యద్‌కు అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గీత వృత్తిదారులకు మోపేట్ బళ్లను ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు హామీని నిలబెట్టుకోలేకపోయిందని, వృత్తిదారులకు వృత్తి పరికరాలు, చేతి వృత్తిదారులకు లక్ష రూపాయలు ఇస్తుందని కానీ గీతా కార్మికులు వృత్తిదారులైన లక్ష రూపాయల ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కల్లు గీత ఆర్థిక కార్పొరేషన్‌కు రూ.21వేల కోట్లు నిధులు కేటాయించి ఈత తాటి ఖర్జూర వనాలు పెంచాలని రాష్ట్రంలో గీత వృత్తిని అభివృద్ధి చేయాలని గీత వృత్తిలో నైపుణ్యం పొందిన వారికి టిఎఫ్టి లైసెన్సులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, సహాయ కార్యదర్శి పండరిగౌడ్, ఉపాధ్యక్షులు సాయగౌడ్, పోతంగల్ టీసీఎస్ అధ్యక్షులు సాయగౌడ్, గీత కార్మికులు రాజాగౌడ్, సురేష్‌గౌడ్, మొగులా గౌడ్, సురేష్‌గౌడ్, యాదగిరిగౌడ్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.


ధర్నా చేపడుతున్న కార్మికులు

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని గుర్జకుంట గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ కందడి మనోహర రమేష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించామని, గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు గ్రామస్తులు తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మీ నర్సింలు, నాయకులు గోపాల్‌రెడ్డి, రాఘువరెడ్డి, బాల మధుసూదన్, రమేష్, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న జయంతి

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలో కౌన్సిలర్ సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373 జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దేవెందర్ గౌడ్, రాజేంధర్‌గౌడ్, పర్శగౌడ్, రామాగౌడ్ , రాజేశ్వర్, బాపురావ్ తదితరులున్నారు

గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్‌గల్ గ్రామంలో ఖాళీ స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్న క్రమంలో సొంత ఇంటి నిర్మాణం కోసం వచ్చిన దరఖాస్తులను సర్పంచ్, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గృహ లక్ష్మీ పథకం కోసం 58 దరఖాస్తులు స్వీకరించగా వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, కంట్రోక్టర్ ఆపరేటర్ తనాజీరావు, కారోబర్ పండరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కుప్కల్ వాసుల చేరిక


కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-భీంగల్

మండంలంలోని కుప్కల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రె స్ నాయకులు ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో శుక్రవా రం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కుప్కల్ గ్రామంలో సునీల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. చేరిన వారిలో మూడ్ గంగాధర్, లక్ష్మి, నర్సయ్య, గ్రామ కమీటీ అధ్యక్షుడు బొర్రన్న, ఎర్రన్న, నర్సింగ్, గంగాధర్, బాలు, మాధవ్, గణేష్, వినోద్, రమేష్, పవన్, రామస్వామి ఉన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, పట్ణ అధ్యక్షుడు నర్సయ్య, అనంతరావ్, కుంట రమేష్, గోపాల్ నాయక్ , పల్లె శేఖర్ తదితరులు ఉన్నారు

బాదితుని ఆర్థిక సాయం

భీంగల్ పట్టణకేంద్రానికి చెందిన దేశ్‌పాండే మహేష్‌కు కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి 10 వేల రూపాయలనుఆర్థిక సాయంగా అందజేశారు. మహేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో శుక్రవారం పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కార్మికుల దీక్షకు.. బీవీఎస్ సంఘీభావం

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ ఎదుట రిలే దీక్షలు నిర్వహిస్తున్న కార్మికుల దీక్షలకు భారతీయ విద్యార్థి సేన కార్యకర్తలు తమ సంఘీభావం శుక్రవారం తెలిపారు. ఈ రిలే దీక్షలు శుక్రవారం నాటికి 14వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా బీవీఎస్ నాయకులు మాట్లాడుతూ.. నిజాంషుగర్ ఫ్యాక్టరీ లేఆఫ్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావలసిన 93 నెలల బకాయిలను చెల్లించాలని, చనిపోయిన కుటుంబాలకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రావలసిన బకాయిలను చెల్లించి ఫ్యాక్టరీ లే ఆఫ్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘీభావం తెలిపిన వారిలో చింతాకుల లోకేష్ గౌడ్, కార్మిక నాయకులు ఎం.రమేష్, బి.వి.ఎస్ ఉపాధ్యక్షులు చిక్కం ప్రవీణ్, ఎడపల్లి మండల ప్రెసిడెంట్ యోగేష్, ఆకాష్, కార్తీక్, శుభం, రంజిత్, శివ, గణేష్, కార్తీక్, స్వామి, మహేష్, సాయితేజ, అరవింద్, లక్ష్మణ్, లోకేష్, భూమేష్, సాయికుమార్, అక్షయ్, దత్తహరి, శేఖర్, రామేశ్వర్, ప్రసాద్, బి.వి.ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీవీఎస్ కార్యకర్తలు

కుల సంఘం భవనానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణంలోని రెండవ వార్డులో భవ్‌సార్ క్షత్రియ సమాజ్ కుల సంఘం భవన నిర్మాణానికి పురపాలక చైర్మన్ సత్యనారాయణ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జాజల సురేందర్ కృషి వలన పట్టణంలో అన్ని కుల సంఘాలకు నిధులు మంజూరై భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కుల సంఘ భవన నిర్మాణానికి 10 లక్షల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భవ్‌సార్ క్షత్రియ సమాజ్ పట్టణ కార్యదర్శి ఉక్కల్కర్ రమేష్, ప్రతినిధులు ప్రకాష్, మహేందర్కార్ గోపాల్, గోజె గోపాల్, గోజె అమృత్‌రావు, ఉక్కల్కర్ సంతోష్, మైత్రజ్‌కర్ శ్రీనివాస్, పోటే శ్రీనివాస్, జాడే చంద్రప్రకాష్, మైత్రజ్ కర్ సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరికలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. వీరికి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎల్లారెడ్డి మండలంలోని అడ్విలింగాల్ గ్రామానికి చెందిన మన్నే కిష్టయ్య, జెలుకరి దేవయ్య మన్నే నారాయణ, 25 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింహులు, జనార్ధన్‌రెడ్డి, నీల రవి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన పలువురు

ఆడపడుచులకు వాయినాల పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రానికి చెందిన గంప రాధాబాయి, రాజేశం దంపతులు శుక్రవారం మహిళలకు శ్రావణ మాస వాయినాలు అందజేశారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వారి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 500 మంది ఆడపడుచులకు బియ్యం, బెల్లం, పప్పు, రైస్ కుక్కర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణమాసంలో ఆడపడుచులకు శ్రావణ మాస వాయినాలు అందిస్తున్నామని, ఈ సంవత్సరం ఏడాది కూడా ఆడపడుచులకు ఇస్తున్నట్లు తెలిపారు.


వాయినాలు పంపిణీ చేస్తున్న దంపతులు

వ్యాధుల నివారణకు ఇంటింటి సర్వే

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ప్రతి ఇంటికి తిరుగుతూ ఆశావర్కర్లు సర్వే నిర్వహిస్తున్నారు. తెల్ల మచ్చలు, కుష్టి వ్యాధి లక్షణాలు, ఇతర వ్యాధులు రాకుండా ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించి వ్యాధుల బారిన పడిన వారికి వైద్యుల సలహా మేరకు తగు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. తెల్ల మచ్చలు, కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేసి చికిత్స నిర్వహించనున్నట్లు ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈనెల 16వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఆశావర్కర్ల ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అమితా, ఏఎన్ఎం మంజుల, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన రాజమౌళి సతీమణి లక్ష్మీ మరణించడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, రంజిత్, సిద్ధరాములు, తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ పంట వివరాలు నమోదు చేసుకోవాలి

- అంజనీ గ్రామంలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఈఓ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని అంజనీ గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏఈఓ ప్రియాంక రైతులు పండిస్తున్న పంట వివరాలను నమోదు చేసుకున్నట్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంజనీ గ్రామంలో ప్రతి రైతు పండిస్తున్న పంటలను వ్యవసాయ అధికారుల వద్ద పట్టాపాస్ తీసుకొచ్చి పంట వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రియాంక, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని బాలబాలికలకు వీర హనుమాన్ కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా సుమారు 50 మం ది బాలబాలికలకు భోజనం చేసే పల్లేలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు గుంజేరి రాజు, వంశీ, హరీష్, సందీప్, సుమన్, సాగర్ పాల్గొన్నారు.


ప్లేట్లు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు